క్లుప్తంగా

తంపరమూల రైతు సంఘం అధ్యక్షుడిగా జగన్



తంపరమూల రైతు సంఘ కార్యవర్గం

మునగపాక: మునగపాకలో తంపరమూల రైతు సంఘం కార్యవర్గం ఆదివారం ఎన్నికైంది. సంఘం అధ్యక్షుడిగా శరగడం జగన్ ఎన్నికయ్యారు. కార్యదర్శిగా దొడ్డి గణేష్‌లతో పాటు పలువురు డైరెక్టర్లుగా నియామకమయ్యారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ రైతుల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు శరగడం గణేష్, కాండ్రేగుల మణికంఠ, పెంటకోట ఆదిశివ, దాడి నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన గీతా జయంత్యుత్సవాలు



తోటాడలో ప్రదర్శన చేస్తున్న భగవద్గీత శిక్షకులు

మునగపాక: మండలంలోని తోటాడలోని ఆది నారాయణ స్వామి రాజయోగాశ్రమం ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన గీతా జయంత్యుత్సవాలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా భగవద్గీత పఠనం చేసిన విద్యార్థులతో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఓంకార పీఠం నుంచి గ్రామంలోని అన్ని వీధుల గుండా ఈ ప్రదర్శన సాగింది. గీతా సారాంశాన్ని వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మేనేజింగ్ ట్రస్టీ సూరిశెట్టి సుసుమ్న మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు ఇతర రంగాల్లో రాణించాలన్నారు. భగవద్గీత పఠనం ఎంతో మంచిదన్నారు. యువత సన్మార్గంలో నడవాలన్నారు. గత 15 నెలలుగా ప్రతి ఆదివారం ఉచిత శ్లోకాల శిక్షణ అందించామన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు కాకి అప్పారావు, దేశెట్టి లక్ష్మణ్, నూకలక్ష్మి నారాయణ, వీరబాబు, వెంకటరావు, రమణ, కుమార్‌రాజా, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉర్సు వేడుకలు



కోటవురట్లలో సందల్ ఊరేగింపు చేస్తున్న ముస్లింలు

కోటవురట్ల: స్థానిక ముస్లిం కాలనీలో మసీదు ఉస్మాన్ ఘని, నవజవాన్ యూత్ ఆధ్వర్యంలో హజరత్ వలి, హజరత్ సయ్యద్ షాహుల్ హమీద్ ఉర్సు వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆసర్ నమాజ్ అనంతరం ఖురాన్ ఖానీ జరిపారు. ముస్లింల ఇళ్ల వద్ద నియాజ్ బావుటా సేకరణ చేశారు. గౌష్ పాక్ నిషాని, హజరత్ ఖాదర్ వలి నిషాని వరకు సందల్ ఊరేగింపు నిర్వహించారు. సర్కార్ జెండాను ఆవిష్కరించి భక్తిని చాటుకున్నారు. అనంతరం ఆమ్‌దావత్ నిర్వహించారు. పెద్ద సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు.

వెంకన్న ఆలయ నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న అచ్చియ్యనాయుడు కుటుంబ సభ్యులు

మునగపాక: మునగపాక బైపాస్ రోడ్డులో రూ.5 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న వేంకటేశ్వర స్వామి ఆలయానికి భక్తులు తనవంతు విరాళాలు అందజేస్తున్నారు. ఆదివారం రాత్రి మునగపాకకు చెందిన పెంటకోట అచ్చియ్యనాయుడు కుమారులు అప్పలనాయుడు, గంగాధర్‌లు రూ.50 వేల విరాళాన్ని కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు కాండ్రేగుల జగ్గారావు, పెంటకోట ఉమేష్, ఆడారి కాశీబాబు, దాడి పోలీసు, వెలగా రామకృష్ణ, సారధి తదితరులు పాల్గొన్నారు.

జంక్షన్.. టెన్షన్..!

- నక్కపల్లిలో రోడ్డెక్కాలంటే భయం.. భయం
- ఆర్టీసీ కాంప్లెక్స్, ఉపమాక రోడ్డు కూడళ్లలో నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులు



నిత్యం ట్రాఫిక్‌తో రద్దీగా ఉండే నక్కపల్లి ఆర్టీసీ బస్టాండ్ కూడలి





ఉపమాక రోడ్డు జంక్షన్‌లో ట్రాఫిక్

నక్కపల్లి: జాతీయ రహదారిపై మండల కేంద్రం నక్కపల్లి జంక్షన్‌లో రోడ్డెక్కాలంటేనే భయంగా ఉంటోంది. ఇటు వైపు నుంచి అటు వెళ్లాలన్నా, అటు నుంచి ఇటు రావాలన్నా ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వెళ్లాల్సి వస్తోంది. నక్కపల్లి పట్టణం జాతీయ రహదారిపై ఉండడంతో చుట్టు పక్కల 10 నుంచి 15 గ్రామాల ప్రజలు నక్కపల్లి మండల కేంద్రానికి చేరుకుని ఇతర ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. తీర ప్రాంతాలకు చెందిన ఉపమాక చందనాడ, బుచ్చిరాజుపేట, రాజయ్యపేట, ఎన్.నర్సాపురం, తమ్మయ్యపేట, బోయపాడు గ్రామాల ప్రజలు ఉపమాక రోడ్డు జంక్షన్‌కు వచ్చి అన్నవరం, తుని, అనకాపల్లి, విశాఖ, విజయవాడ వంటి పట్టణాలకు వెళ్తుంటారు. ఇక పెదబోదిగల్లం, చినబోదిగల్లం, అప్పల పాయకరావుపేట, సీతంపాలెం, పెదదొడ్డిగల్లు తదితర గ్రామాలకు చెందిన వారు **ఆర్టీసీ కాంప్లెక్స్** జంక్షన్‌కు చేరుకుని ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి ఉంటోంది. ఈ రెండు ప్రధాన కూడళ్ల వద్ద అత్యంత ప్రమాదకరంగా మారాయి. విపరీతమైన ట్రాఫిక్ రద్దీ, జనసంచారం ఉంటోంది.

- ఆర్టీసీ కాంప్లెక్స్ కూడలి వద్ద పోలీస్ స్టేషన్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలతో పాటు, పెట్రోలు బంకు, స్టేట్ బ్యాంకు, కాఫీ హోటళ్లు, జెరాక్స్ సెంటర్లు ఎక్కువగా ఉన్నాయి. వివిధ పట్టణాలకు వెళ్లే బస్సులన్నీ ఈ జంక్షన్‌లోనే ఆగి ప్రయాణికులను ఎక్కించుకోవడం, దింపడం జరుగుతుంటాయి. దీంతో ఈ కూడలిలో రోడ్డుపైన నిలబడాలన్నా, ఇటు నుంచి అటు వెళ్లాలన్నా ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వెళ్లాల్సి ఉంటుంది. ఇక్కడ ట్రాఫిక్ సిగ్నల్స్ లేవు. రోడ్డు దాటే వారిని, మితిమీరిన వేగంతో ప్రయాణించే వాహనాలను నియంత్రించేందుకు ఇక్కడ కనీసం ఒక్క ట్రాఫిక్ **కానిస్టేబుల్** కూడా అందుబాటులో లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఆర్టీసీ కాంప్లెక్స్ కూడలి నుంచి బోదిగల్లం వెళ్లే రోడ్డు ఇరువైపులా ఆక్రమణలకు గురైంది. ఇక్కడ రోడ్డు మీదకు షాపింగ్ కాంప్లెక్స్‌లు నిర్మించడంతో షాపుల ముందు ద్విచక్ర వాహనాలను నిలిపివేస్తున్నారు. దీంతో రాకపోకలకు ఇబ్బందవుతోంది.
- ఉపమాక కూడలిలో కూడా ట్రాఫిక్ సమస్య ఉంది. ఇక్కడ మెయిన్ రోడ్డుపైనే ఆటోలను నిలిపి ప్రయాణికులను ఎక్కించడం, దింపడం చేస్తుంటారు. గ్రామాల నుంచి జాతీయ రహదారిపైకి చేరుకునే సమయంలో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. మూడేళ్ల క్రితం ఇదే జంక్షన్‌లో పదో తరగతి పరీక్షలకు వెళ్లే విద్యార్థులు బైక్‌పై వస్తూ ప్రమాదానికి గురై మరణించారు. ఉపమాక ఆలయానికి వచ్చే వెళ్లే వారు ఈ జంక్షన్‌లో వేచి ఉంటూ తమ గమ్యస్థానాలకు చేరుకుంటారు. నిత్యం రద్దీగా ఉండే ఈ కూడలిలో ట్రాఫిక్ నియంత్రణకు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి.

భద్రత చర్యలు అవసరం

జాతీయ రహదారిని ఎక్స్‌ప్రెస్ **హైవేగా ప్రకటించడంతో వాహనాలు** మితిమీరిన **వేగంతో రాకపోకలు సాగిస్తుం**టాయి. ఈ **రెండు జంక్షన్లలో ట్రాఫిక్ సిగ్నల్స్** ఏర్పాటు **చేయాలని చాలా పర్యాయాలు**గా విజ్ఞప్తి **చేస్తున్నప్పటికీ నేషనల్ హైవే అధికా**రులు, పోలీసులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. ఆర్టీసీ కాంప్లెక్స్ కూడలిలో దార్లపూడి, పెట్టుగోళ్లపల్లి ప్రాంతాల నుంచి వచ్చే ఇసుక, గ్రావెల్ ట్రాక్టర్లు విపరీతమైన వేగంతో రోడ్డు క్రాస్ చేస్తుంటాయని, అటువంటి సమయాల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి. గతంలో పలు సందర్భాల్లో ఇక్కడ చాలా మంది రోడ్డు దాటే సమయంలోను, రోడ్డు పక్కన నిల్చున్న సందర్భాల్లోను గాయాలపాలవడం, మరణించడం వంటి ఘటనలు కూడా జరిగాయి. అడ్డురోడ్డు, తుని, యలమంచిలి, అనకాపల్లి పట్టణాల్లో చదువుకునే విద్యార్థులు సైతం ఈ జంక్షన్ల నుంచి రాకపోకలు సాగిస్తుంటారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కూడళ్లలో ట్రాఫిక్ కానిస్టేబుళ్లను నియమించడం, సిగ్నల్స్ ఏర్పాటు చేయడం వంటి భద్రతా చర్యలు తీసుకుని ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు



ఆర్టీసీ కాంప్లెక్స్ కూడలి, ఉపమాక రోడ్డు జంక్షన్‌లలో కానిస్టేబుళ్లను నియమించి ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు చర్యలు తీసుకుంటాం. రోడ్డుపై ఆటోలు, ఇతర ద్విచక్ర వాహనాలు నిలపకుండా చర్యలు చేపడతాం. ఉపమాక రోడ్డు జంక్షన్‌లో ప్రయాణికుల కోసం ఆటోలను రోడ్డుపైనే నిలుపుతున్నారని ఫిర్యాదులు వస్తున్నాయి. ఇక నుంచి అలా జరగకుండా ఆటో డ్రైవర్లతో సమావేశం ఏర్పాటు చేసి ఆదేశిస్తాం.
– కుమార స్వామి, సీఐ, నక్కపల్లి

నేడు ఉపాధి ప్రజావేదిక

యలమంచిలి రూరల్: ఉపాధి హామీ పథకం 17వ విడత సామాజిక తనిఖీ ప్రజా వేదిక సోమవారం యలమంచిలి మండల పరిషత్ కార్యాలయంలో జరగనుందని ఎంపీడీవో కె.కొండలరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ప్రజావేదికకు ఎమ్మెల్యే విజయ్‌కుమార్ హాజరవుతారని పేర్కొన్నారు. ప్రజావేదికలో 01.04.2023 నుంచి 31.03.2024 వరకు మండలంలో జరిగిన ఉపాధి పనులకు సంబంధించి గతంలో గ్రామాల వారీగా సామాజిక తనిఖీ చేపట్టినట్టు తెలిపారు. ఇందుకు సంబంధించి గ్రామసభలు సైతం గతంలోనే నిర్వహించామన్నారు. ఉపాధి హామీ పథకంలో గుర్తించిన అవకతవకల గురించి మండల స్థాయి సామాజిక ప్రజావేదికలో చర్చించి చర్యలు తీసుకోనున్నామని పేర్కొన్నారు.

విద్యుత్ పొదుపు తప్పనిసరి

పాయకరావుపేట: ప్రతి ఒక్కరూ విద్యుత్ పొదుపు పాటించడం తప్పనిసరని ఆ విద్యుత్ శాఖ ఎస్ఈ జి.ప్రసాద్ అన్నారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల సందర్భంగా మండల పరిషత్ ఆవరణలోని స్త్రీ శక్తి భవన్‌లో విద్యుత్ పొదుపు అనే అంశంపై స్వయం సహాయక బృందాలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్‌ను ఆదా చేసి, భావితరాలకు భరోసానిద్దామని చెప్పారు. గృహాల్లో ఉపయోగించే విద్యుత్ ఉపకరణాలు స్టార్ రేటెడ్ ఉండేలా చూసుకోవాలన్నారు. డిస్కమ్‌ల ద్వారా శక్తి సంరక్షణ, శక్తి సామర్థ్య కార్యకలాపాల ప్రాముఖ్యతపైన, గృహోపకరణాలు వినియోగంపైన, విద్యుత్ పొదుపు చేసుకుని, విద్యుత్ బిల్లు తక్కువ వచ్చే అంశాలపైన మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో ఏఈ కె.రాజశేఖర్, పాయకరావుపేట టౌన్, పాయకరావుపేట రూరల్, నక్కపల్లి మండలాలకు విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజినీర్లు, విద్యుత్ శాఖ లైన్‌మెన్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

19న మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ మహాసభ

అనకాపల్లి: ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్ల యూనియన్ రాష్ట్ర 6వ మహాసభ ఈ నెల 19న విజయవాడలో నిర్వహించనున్నట్లు యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సభలో వివిధ ప్రభుత్వ ఆస్పత్రుల్లోని కార్మికుల సమస్యలపై చర్చిస్తారన్నారు.

త్యాగమూర్తులకు ఘన నివాళులు



చినదొడ్డిగల్లు గ్రంథాలయంలో పటేల్, శ్రీరాములు చిత్ర పటాలకు నివాళులర్పిస్తున్న పాఠకులు



యలమంచిలి దిమిలి రోడ్డు కూడలి వద్ద పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య పెద్దలు

నక్కపల్లి: ఆంధ్రుల ఆశయ సాధన కోసం తమ జీవితాన్నే త్యాగం చేసిన త్యాగధనుడు పొట్టి శ్రీరాములని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, విశ్రాంత ఉపాధ్యాయుడు శ్రీపాద సత్యదేవ శర్మ అన్నారు. ఆదివారం అమరజీవి పొట్టిశ్రీరాములు, దేశ ఉక్కుమనిషిగా పేరొందిన సర్దార్ వల్లభాయి పటేల్‌ల వర్ధంతి సందర్భంగా చినదొడ్డిగల్లు శాఖా గ్రంథాలయంలో వారి చిత్ర పటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు చేసిన సేవలను కొనియాడారు. తెలుగు ఉపాధ్యాయుడు ఎస్.వి.ఎస్.ఆచార్యులు మాట్లాడుతూ స్వాతంత్ర్యం అనంతరం అనేక సంస్థానాలను దేశంలో విలీనం కావడానికి పటేల్ ఎంతో కృషి చేశారని గుర్తు చేశారు. నేటి తరం విద్యార్థులు పటేల్, శ్రీరాములు వంటి మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి కె.జనార్దన్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యలమంచిలి రూరల్: ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు చిరస్మరణీయుడని మున్సిపల్ వైస్ చైర్మన్ అల్లైపు సత్య గుప్తా అన్నారు. పట్టణంలోని దిమిలి రోడ్డు కూడలి వద్ద ఆదివారం పొట్టిశ్రీరాములు వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణానికి చెందిన పలువురు ఆర్యవైశ్య పెద్దలు కూడలిలో పొట్టిశ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గుప్తా మాట్లాడుతూ భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటే ప్రాతిపదికగా ఆంధ్ర రాష్ట్రం కోసం ఆయన చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో రంగా చినవెంకటస్వామి, కట్టమూరి బసవరాజు, కట్టా శ్రీనివాస్, తీగల వెంకటేష్, కుసుమంచి జోగురాజు గుప్తా, దాసరి బాలు, పలువురు ఆర్యవైశ్య సామాజిక వర్గానికి చెందిన వ్యాపారులు పాల్గొన్నారు.



ఎస్.రాయవరం కార్యాలయంలో శ్రీరాములు చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న రెవెన్యూ సిబ్బంది

ఎస్.రాయవరం: ఆంధ్ర రాష్ట్ర అవతరణకు పొట్టి శ్రీరాములు ప్రాణ త్యాగం చేసి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని డిప్యూటీ తహసీల్దార్ ఎం.ఎస్.వి.నీరజ్ అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో ఆదివారం పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ మణికంఠ, మండల సర్వేయర్ మూర్తి, వీఆర్వో సంఘం అధ్యక్షుడు నూకరాజు, వీఆర్వోలు శ్రీధర్, గోపి, జోగారావు, తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

- కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం
- భూమి కాలువ వైస్ చైర్మన్‌కు సన్మానం



భూమి కాలువ వైస్ చైర్మన్ నూకన్ననాయుడిని సన్మానిస్తున్న వీసం, తదితరులు

నక్కపల్లి: ఇటీవల జరిగిన నీటి వినియోగదారుల సంఘాల ఎన్నికల్లో చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్లుగా ఎన్నికైన వారు ఆయకట్టు రైతుల సమస్యలు పరిష్కరించడంతో పాటు, సాగు నీరు పుష్కలంగా అందేందుకు కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ కోరారు. సుమారు 5 వేల ఎకరాలు ఆయకట్టు కలిగి పాయకరావుపేట, నక్కపల్లి మండలాల్లో విస్తరించిన ఉన్న తాండవ భూమి కాలువ నీటి వినియోగదారుల సంఘానికి వైస్ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన ఒడ్డిమెట్ట రైతు పయిల నూకన్న నాయుడు, ఉద్దండపురం పూర చెరువు చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన ఎరుబంది సూరిబాబులను ఆదివారం ఘనంగా సన్మానించారు. ఒడ్డిమెట్టలో జరిగిన ఈ కార్యక్రమంలోఎంతో ప్రతిష్టాత్మకమైన తాండవ భూమి కాలువ చైర్మన్‌గా గెద్దం చైతన్య, వైస్ చైర్మన్‌గా నూకన్ననాయుడిని ఆయకట్టు రైతులు ఏకగ్రీవంగా ఎన్నుకోవడం అభినందనీయమన్నారు. ప్రతి ఏటా ఖరీఫ్, రబీ సీజన్లలో సాగునీటి కొరత లేకుండా నూతనంగా ఎన్నికైన డైరెక్టర్లు చర్యలు తీసుకోవాలని కోరారు. వైస్‌చైర్మన్ నూకన్నాయుడు మాట్లాడుతూ తనను వైస్ చైర్మన్‌గా ఎంపిక చేసిన రైతు నాయకులు గెద్దం బుజ్జి, తోట నగేష్, ఇతర రైతు నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు గౌర్ల నర్సింహమూర్తి, పొడగట్ల వెంకటేష్, ఉప సర్పంచ్ వేగేశ్న చంటి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు దండు బలరామరాజు, మాజీ పీఏసీఎస్ చైర్మన్ పొడగట్ల పాపారావు, వార్డు సభ్యులు సఖిరెడ్డి రమణ, వియ్యపు వరహాలు, గింజాల నూకరాజు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఎస్.రాయవరం: కొరుప్రోలు సబ్‌స్టేషన్ పరిధిలో గోకులపాడు, పెదగుమ్ములూరు ఫీడర్ల పరిధిలో సోమవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని అనకాపల్లి ఈఈ రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఫీడర్ మెయింటెనెన్స్ కారణంగా ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు పేర్కొన్నారు.

గణపర్తి, చెల్లమలలో నేడు రెవెన్యూ సదస్సులు

మునగపాక: మండలంలోని గణపర్తి, చెల్లమల గ్రామాల్లో సోమవారం రెవెన్యూ సదస్సులు జరుగుతాయని తహసీల్దార్ ఎస్.ఆదిమహేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు గణపర్తి రామాలయంలో, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు చెల్లమల రామాలయం వద్ద జరిగే సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఘనంగా సామూహిక హారతి



వాడ్రాపల్లి రామాలయంలో సామూహిక హారతి ఇస్తున్న భక్తులు

మునగపాక: వాడ్రాపల్లి రామాలయంలో ఆదివారం రాత్రి సామూహిక హారతి కార్యక్రమం ఘనంగా జరిగింది. పౌర్ణమి సందర్భంగా ఆలయంలో ఏర్పాటు చేసిన హారతి కార్యక్రమానికి భక్తులు భారీగా తరలివచ్చారు. శ్రీరామ నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. ఈ కార్యక్రమంలో పెద్దలు పెతకంశెట్టి రామజోగినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

తుప్పలతో తిప్పలు



బీసీ కాలనీలో పెరిగిపోతున్న తుప్పలు

మునగపాక: మునగపాక బీసీ కాలనీలో ప్రభుత్వ స్థలంలో తుప్పలు పేరుకుపోతున్నాయి. దీంతో రాత్రుల సమయంలో విష సర్పాలు సంచరిస్తున్నాయంటూ కాలనీ వాసులు వాపోతున్నారు. బీసీ కాలనీ ఏర్పాటులో భాగంగా సామాజిక అవసరాల నిమిత్తం 23 సెంట్ల స్థలాన్ని కేటాయించారు. ఈ స్థలంలో ఇంతవరకు ఎటువంటి సదుపాయాలు కల్పించకపోవడంతో తుప్పలు పెరిగిపోతున్నాయి. దీంతో పాముల సంచారం ఎక్కువైంది. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించే వారు భయాందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తుప్పల తొలగింపు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

సందడిగా ఆత్మీయ సమావేశాలు



అరకులో కలుసుకున్న మునగపాక హైస్కూల్ పూర్వ విద్యార్థులు



మూలపేట గంగాలమ్మతల్లి గుడి సన్నిధిలో సూరిశెట్టి కుటుంబ సభ్యుల సందడి

మునగపాక: మునగపాక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 1987–88లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం అరకులో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ బ్యాచ్ విద్యార్థులంతా బస్సులో బయలు దేరి పాడేరులోని మోదకొండమ్మను దర్శించుకున్నారు. అనంతరం డల్లాపల్లి, చాపరాయి వంటి ప్రాంతాలను సందర్శించి ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉల్లాసంగా గడిపారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్, పార్టీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, ఉద్యోగ, వ్యాపార రంగాల్లో స్థిరపడిన మిత్రులంతా ఉత్సాహంగా గడిపి మధ్యాహ్నం సహపంక్తి భోజనాలు చేశారు.

- మునగపాకకు చెందిన సూరిశెట్టి కుటుంబ సభ్యులంతా ఆదివారం మూలపేటలోని గంగాలమ్మతల్లి గుడి సన్నిధిలో వనభోజనాలు నిర్వహించారు. ఏటా సూరిశెట్టి కుటుంబ సభ్యులంతా ఒకచోట చేరి ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటపాటలతో ఉత్సాహంగా గడపడం ఆనవాయితీ. ఈ ఏడాది కూడా పిల్లలు, పెద్దలంతా ఒక చోట చేసి సందడి చేశారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో సహపంక్తి భోజనాలు చేశారు. సూరిశెట్టి కన్నారావు, స్వరాజ్యం, రమణబాబు, అప్పలనాయుడు, దుర్గ నాయుడు, గోవింద, సాయిరాం, తదితరులు ఈ సమావేశానికి నేతృత్వం వహించారు.



పాటిపల్లి ఆలయంలో సమావేశమైన మునగపాక హైస్కూల్ 1991-92 బ్యాచ్ విద్యార్థులు

- మండలంలోని పాటిపల్లి లక్ష్మీనరసింహ స్వామి ఆలయ ప్రాంగణంలో మునగపాక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో చదువుకున్న 1991–92 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు సమావేశమయ్యారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు. జెడ్పీటీసీ సభ్యుడు పెంటకోట స్వామి సత్యనారాయణ, పీలా సూరిబాబు, పెంటకోట ఉమేష్, వేగి అప్పలనాయుడు, శరగడం రామకృష్ణ, పెంటకోట శ్రీను, ఇంద్రమోహన్, తదితరులు ఈ ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు.

చర్చిలకు క్రిస్మస్ శోభ



విద్యుద్దీపాలంకరణలో ఆంధ్ర సెంటినరీ బాప్టిస్టు చర్చి



విద్యుత్ వెలుగులో కాకివానివీధి జేసీపీఎఫ్ చర్చి

యలమంచిలి రూరల్: పట్టణంలో క్రిస్మస్ సందడి మొదలైంది. క్రైస్తవులు ఆరాధన, ప్రార్థనలు, భక్తి గీతాలాపనలతో తరిస్తున్నారు. క్రీస్తు సందేశాలు, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆదివారం పట్టణంతో పాటు గ్రామాల్లో క్రైస్తవ ప్రార్థనా మందిరాల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. కొన్ని చోట్ల చర్చిల్లో బాల యేసు జననం ఘట్టాన్ని చూపేలా పశువుల పాకల్లో బొమ్మలతో చేసిన చేసిన ప్రత్యేక ఏర్పాట్లు ఆకట్టుకుంటున్నాయి. రంగురంగుల విద్యుద్దీపాలతో పట్టణంలోని పురాతన ఏబీసీ చర్చి, జేసీపీఎఫ్ చర్చిలు మెరిసిపోతున్నాయి. బైపాస్ రోడ్డులో రోమన్ కేథలిక్ చర్చిని క్రిస్మస్ కోసం అందగా ముస్తాబు చేస్తున్నారు. మరో 9 రోజుల్లో రానున్న క్రిస్మస్ పర్వదినం కోసం క్రైస్తవ ప్రార్థనా మందిరాల వద్ద సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తున్నారు.

అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా పాత హాస్టల్



మునగపాకలోని పూర్వపు సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహం

మునగపాక: మునగపాక బీసీ కాలనీలో పూర్వపు సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృగం అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారింది. గత 8 సంవత్సరాల క్రితం పిల్లల సంఖ్య తక్కువగా ఉండడంతో వసతి గృహం మూసివేశారు. అప్పటి నుంచి వసతి గృహం నిర్వహణ ఎవరికీ పట్టకపోవడంతో కొంతమంది యువకులు అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా వినియోగించుకుంటున్నారు. భవనం ప్రహరీ దెబ్బతినడంతో రాత్రుల సమయంలో కొంతమంది మద్యం, గంజాయి వంటి చెడు వ్యసనాలకు వినియోగిస్తున్నట్టు స్థానికులు చెబుతున్నారు. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.